బతుకు బండి.. పంక్చర్

- గాలి లేని టైర్ల వంటివి వారి జీవితాలు
- కదలనివ్వకుండా మొరాయించే పరిస్థితులు
- పంక్చర్ మెకానిక్‌ల వెతలెన్నో
- కార్మికులుగా ప్రభుత్వాలు గుర్తించక ఎన్నో ఇబ్బందులు



ద్విచక్ర వాహనాలకు పంక్చర్ వేస్తున్న మెకానిక్



సైకిళ్లకు పంక్చర్ వేస్తున్న మెకానిక్

డాబాగార్డెన్స్: అన్నీ సక్రమంగా ఉంటేనే బండి నడుస్తుంది. ఏ ఒక్కటి తేడా వచ్చినా కదలక మొరాయిస్తుంది. అలాటి ఓ సమస్య టైర్ పంక్చర్. ఎంత గొప్ప వాహనమైనా.. టైర్ పంక్చరయితే ప్యాచ్ వేసే వారి అవసరం తప్పనిసరి. అయితే ఇదే వృత్తిగా గడిపే వారి బతుకు బండి మాత్రం కదలడానికి ససేమిరా అంటోంది. ఏళ్ల తరబడి ఈ వృత్తి చేసినా పరిస్థితి ఒకే విధంగా ఉంటోంది. తమను కార్మికులుగా కూడా ప్రభుత్వం గుర్తించడం లేదని, దాంతో జీవితానికే పంక్చర్ పడినట్టయిందని వారు ఆక్రోశిస్తున్నా ఫలితం లేకుండా ఉంది.

కష్టాలు కోకొల్లలు..

బండి రయ్యిన దూసుకుపోతూ ఉంటుంది. కండిషన్లో ఉన్న వాహనం పరుగులు తీస్తూ ఉంటుంది. మనకూ ఉత్సాహంగా ఉంటుంది. అంతలోనే.. కుదుపులు.. బండి కదలక ఇబ్బందులు. చూస్తే టైర్ పంక్చర్. దాంతో ఒక్కసారిగా మనసు ఉసూరంటుంది. ఏం చేయాలో తోచక అటూ ఇటూ చూస్తే అల్లంత దూరంలో పంక్చర్ షాపు. హమ్మయ్యా అంటూ ప్యాచ్ వేయించుకుని బయలుదేరుతాం. తర్వాత అతడి గురించి మరిచిపోతాం. గ్రామాలు, పట్టణాలతో పాటు ప్రధాన రహదారుల వెంట ఆపద్బాంధవుల్లా కనిపించే ఆ ప్యాచ్ వాలాల గురించి పెద్దగా ఆలోచించం. వీళ్ల కష్టాల గురించి పట్టించుకోం. అయితే వారి జీవితంలోకి తొంగిచూస్తే మాత్రం పంక్చర్ పడ్డ బళ్లే కనిపిస్తాయి. నాటి సైకిళ్ల కాలం నుంచి నేటి బైక్‌ల యుగం వరకు మారని జీవన స్థితిగతులు వెక్కిరిస్తాయి. పంక్చర్ రేటు 50 పైసల నుంచి ఇప్పుడు 60.. 70కి చేరుకున్నా, దాంతో పాటు పెరిగిన ఇక్కట్లు పలకరిస్తాయి.

కూలి పనులే దిక్కు..

నియోజకవర్గంలో దాదాపు 200కి పైగా పంక్చర్ దుకాణాలు ఉన్నాయి. గతంలో పంక్చర్ దుకాణం పెట్టాలంటే పెద్దగా పెట్టుబడి అవసరం ఉండేది కాదు. అయితే అప్పట్లో ఆదుకున్న సైకిళ్లు క్రమేపీ కనుమరుగవుతుండడంతో చాలా మంది సైకిళ్ల పంక్చర్ దుకాణదారులు రోడ్డున పడ్డారు. మరికొందరు కూలి పనులకు, ఇతర పనులకు వెళ్లిపోతున్నారు. కొద్ది మంది మోటర్లతో నడిచే వాహనాలకు ప్యాచ్‌లు వేసే పనిలోకి వచ్చారు.

ముద్ర రుణాలూ గగనమే..

పెద్ద వాహనాల పంక్చర్ దుకాణం పెట్టాలంటే ఆర్థికంగా సవాలే. ఇందుకు కనీసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. ఇందులో కంప్రెషర్ రూ.30 వేలకు పైగా, మిగతా మొత్తం ఇతర పరికరాల కొనుగోలుకు వెచ్చించాల్సి వస్తుంది. నగరంలో చూసుకుంటే వేలాది రూపాయలు అద్దె చెల్లించనిదే దుకాణాలు పెట్టుకోలేని పరిస్థితి. ఏ రోడ్డు పక్కనో పెట్టుకుందామంటే జీవీఎంసీ అధికారులు దుకాణాలు తొలగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ముద్ర రుణాల విషయంలో బ్యాంకర్లు అనేక రకాలుగా మెలికలు పెడుతున్నారని పంక్చర్ దుకాణదారులు వాపోతున్నారు.

కార్మికులుగా గుర్తించండి..

నిత్యం కష్టపడితేనే గాని కుటుంబ పోషణ కష్టమవుతోందని, తమను కార్మికులుగా గుర్తిస్తే కొంత వెసులుబాటు కలుగుతుందని పంక్చర్ వేసేవారు కోరుతున్నారు. తమకు ఎటువంటి సంఘాలు లేవని, తమకు కూడా కార్మిక శాఖ గుర్తించి కార్డులు అందజేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

వ్యాపారం అంతంతమాత్రమే..



1975 నుంచి ఇదే ప్రాంతంలో సైకిల్ పంక్చర్లు వేసుకుని బతుకు బండి ఈడుస్తున్నా. గత కొంత కాలంగా వ్యాపారం అంతగా ఉండడం లేదు. రోజంతా కష్టపడి పనిచేస్తే సాయంత్రానికి రూ.200 నుంచి రూ.300 వరకు సంపాదించడం కష్టంగా ఉంటోంది. మాలాంటి వారికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణాలు అందించాలి.

– అర్జున్, చలువతోట, ఎస్‌ఆర్‌ఎంటీ వద్ద

చాలీచాలని ఆదాయం..



గత 20 ఏళ్లుగా ఇదే పని చేస్తున్నాను. నాకు ఒక కుమారుడు ఉన్నాడు. పదో తరగతి వరకు చదివాడు. జడ్జి కోర్టు సమీపాన ఓ జిరాక్స్ దుకాణంలో పని చేస్తున్నాడు. చాలీ చాలని ఆదాయం. నాకు ఒక కన్ను పోయింది. పింఛన్‌కు దరఖాస్తు పెట్టుకుందామంటే.. రెండు కళ్లు పోయిన వారికేనని చెబుతున్నారు. రోజంతా కష్టపడితే గాని పూట గడవదు. మాలాంటి వారిని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– బుజ్జిబాబు, పంక్చర్ కార్మికుడు, మక్కా మసీదు, జగదాంబ జంక్షన్, కేజీహెచ్ అప్‌రోడ్డు

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో రాజేంద్ర కుమార్, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో మహాన్నదానం



అన్న ప్రసాదం వడ్డిస్తున్న రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ సభ్యులు మంగళవారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వద్ద మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సందీప్‌రెడ్డి, సీతారామరాజు, బి.వికాస్, అబిక్ హీరావత్, శ్రీదర్స్, పునీత్ తదితరులు మాట్లాడుతూ నిత్యం అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంస్థను అభినందించారు. మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం సంతృప్తినిచ్చిందన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

డాబాగార్డెన్స్: డయల్ యువర్ ఆర్‌ఎం పేరిట బుధవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాకినాడ, రాజమండ్రి సెక్టార్స్ వారు కూడా డయల్ యువర్ ఆర్‌ఎం కార్యాక్రమంలో పాల్గొని సలహాలు, సందేహాలు ఇవ్వొచ్చు. ఆసక్తి గల వారు 9959225580 నెంబరుకు డయల్ చేయాలన్నారు.

యోగ సిద్ధాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

మురళీనగర్: మురళీనగర్ జాతీయ రహదారిలోని సూర్యనగర్ 2లో ఉన్న యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యుడి ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో ఈ పూజలు జరిగాయి. స్వామివారికి సిందూర అర్చన చేసి, ధూప, దీప నైవేద్యాలు, మంత్రపుష్పం సమర్పించారు. యోగ సిద్ధాంజనేయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సామూహికంగా సుందరకాండ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మానసిక సమస్యలతో వివాహిత ఆత్మహత్య



ప్రత్యూష మృతదేహం

కూర్మన్నపాలెం: అశోకనగర్‌లోని ఎస్‌కే రెసిడెన్సీలో నివాసం ఉంటున్న 38 ఏళ్ల వివాహిత పిన్నంరాజు ప్రత్యూష మానసిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున ఆమె అపార్ట్‌మెంట్ టెర్రస్ పైకి వెళ్లి దూకింది. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దువ్వాడ పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ప్రత్యూష తొమ్మిదేళ్లగా మానసిక సమస్యలతో బాధపడుతోంది. ఆమె భర్త పి.అనేష్ అచ్యుతాపురం ఎస్‌ఈజెడ్‌లో పని చేస్తున్నాడు. వీరికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. తమ కుమారుడి చదువు కోసం ఇటీవలే రాంబిల్లి నుంచి అశోక్‌నగర్‌కు వచ్చి నివాసం ఉంటున్నారు. వారికి వివాహమై 16 ఏళ్లు అయిందని పోలీసులు తెలిపారు. సంఘటనపై ప్రత్యూష తండ్రి, రిటైర్డ్ ఉక్కు ఉద్యోగి పాకలపాటి సత్యనారాయణరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమార్తె మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంధుడికి ఆశ్రయం



సత్తిబాబును షెల్టర్‌కు తీసుకొచ్చిన పీఎం పాలెం పోలీసు

అల్లిపురం: పీఎంపాలెం బస్టాప్‌లో గత నాలుగు నెలలుగా భిక్షాటన చేస్తూ కడుపు నింపుకుంటున్న అంధుడికి ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించినట్లు షెల్టర్ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పీఎంపాలెం, ఆర్‌హెచ్ కాలనీకి చెందిన వద్దాది సత్తిబాబు షుగర్ కారణంగా అంధుడయ్యాడు. తొలుత అతను అనకాపల్లిలో రిక్షా తొక్కుకునేవాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు ఆయనను డే అండ్ నైట్ షెల్టర్‌కు తరలించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వైద్యుల అసోసియేషన్ కార్యదర్శిగా డాక్టర్ అన్వేషి



మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్స్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా కేజీహెచ్‌కు చెందిన యువ వైద్యురాలు అన్వేషి ఎంపికయ్యారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా ఈ ఎంపిక పత్రాన్ని డాక్టర్ అన్వేషికి అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ కమిటీ సభ్యులు ఆర్. రమేష్, పరిపూర్ణచారి, వెలమాటి సురేష్ తదితరులు డాక్టర్ అన్వేషిని అభినందించారు.

హామీల అమలులో కూటమి విఫలం

34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి



34వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆరోపించారు. మంగళవారం ఆమె వార్డు పరిధి 47వ నంబరు బూత్ ప్రాంతంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం పెట్టి తమ కుటుంబాలను వీధిన పడేశారని ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించే వారని తెలిపారు. దాంతో తమ కుటుంబ అవసరాలు తీర్చుకునేవారమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ఆటోవారి బతుకులు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు, ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ లండా రమణ, లింగం శ్రీనివాస్, 47వ బూత్ ప్రెసిడెంట్ పిల్లి సత్తిబాబు, దూడ అప్పారావు, గోవింద్, కేబుల్ చిన్న, నాగోలు శ్రీను, జ్యోతి, గాలి పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

435 మంది ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భాగంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాల నుంచి 435 మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. వాణిజ్యం, నిర్వహణ అధ్యయనాల విభాగం నుంచి 205 మంది ఎంపికయ్యారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 18 మందిని మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమించుకుంది. ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను వీసీ ఆచార్య రాజశేఖర్ తన కార్యాలయంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబు, డీసీఎంఎస్ అధిపతి ప్రొఫెసర్ జె.రవి, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ గణేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి వాసుపల్లి చేయూత



మహ్మద్ రహ్మతుల్లాకి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: క్యాన్సర్‌తో బాధ పడుతున్న వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. జీవీఎంసీ 39వ వార్డులో మహ్మద్ రహ్మతుల్లా అనే వ్యక్తి గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాదపడుతున్నారని తెలుసుకున్న వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఈ విషయం వాసుపల్లి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాసుపల్లి స్పందించి రహ్మతుల్లా ఇంటికి వెళ్లి పరామర్శించి రూ. 5 వేలు అందించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చన్నారు. తాను పుట్టిన ప్రాంతం అయిన వన్‌టౌన్‌లో మంది ఆర్థికంగా, అనారోగ్యంతో బాధపడుతున్నారని అన్నారు. అటువంటి వారందరకీ సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రహ్మతుల్లాకి వైద్యం నిమిత్తం ఎటువంటి సహాయం అందిచడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ యాసీన్ బాబ్జీ, సత్య మాధురి, బుజ్జి, నూకరత్నం, ప్రసాద్, వెంకటి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బనారస్ రైలుకు అంకోరా స్టేషన్‌లో హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–బనారస్–విశాఖపట్నం (18523/18524) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11వ తేదీ నుంచి అంకోరా స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నారు. విశాఖపట్నం–బనారస్ (18523) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు ఉదయం 5.08 గంటలకు చేరుకుని 5.10 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో బనారస్–విశాఖపట్నం (18524) ఎక్స్‌ప్రెస్ అంకోరా స్టేషన్‌కు సాయంత్రం 6.40 గంటలకు చేరుకుని 6.42 గంటలకు బయల్దేరుతుంది.

ఉల్లాసంగా బాలూ స్వర ఝరి



మాట్లాడుతున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ

డాబాగార్డెన్స్: బాలు స్వర ఝరి సీజన్–2 సినీ సంగీత విభావరి ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ద్వారకానగర్‌లోని స్వరరాగ స్టూడియోలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గాయని నీలు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కాశ్మీరు లోయలో కన్యాకుమారివో, జాబిలమ్మ, మనసే మౌనమా, ఉరకలై గోదావరి ఒదిగెనా ఒడిలోనికి, ఆనందో బ్రహ్మ వంటి అనేక మధుర గీతాలను గాయనీ, గాయకులు నీలు, హనుమంతు సుధాకర్, లఖినేని బాలకృష్ణ, జేఎస్ నివాస్, ఏవీ వెంకట్రావు, హనుమంతరావు ఆలపించి శ్రోతలను అలరించారు. ఈ సందర్భంగా బాలు స్వర ఝరి వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ బాలు స్వర ఝరి సీజన్–2 విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. గాయనీ గాయకులు చక్కటి గాత్ర ధర్మం పాటించి, శ్రోతలను అలరించారన్నారు. ఔత్సాహిక యువతకు అవకాశాలు కల్పించడం ద్వారా బాలు స్వర ఝరి ఓ ప్రవాహంలో ముందుకు సాగనుందని ఈ సందర్భంగా తెలిపారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్రపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీపీఎం డిమాండ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం అధికారం చేపట్టిన 2021 నుంచి ఇప్పటి వరకు 4 సార్లు అధ్యయన యాత్రలు చేపట్టిందని, దీనివల్ల ఏం ప్రయోజనమని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మరలా ఈ నెల 14 నుంచి 23 వరకు ఢిల్లీ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో అధ్యయన యాత్ర చేపడుతోందని, ఈ యాత్రలకు కోట్ల రూపాయల ప్రజల నిధులు ఖర్చు చేస్తోందని, కార్పొరేటర్ల అధ్యయన యాత్రపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో చేపట్టిన అధ్యయన యాత్రల అంశాలు, అనుభవాలపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి, నగరాభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టిన పాపాన పోలేదని, ఇప్పుడు మరోసారి యాత్రలకు సిద్ధపడ్డారని, వీటిని అధ్యయన యాత్రలనే దాని కన్నా విహార యాత్రలంటే సరిగ్గా ఉంటుందన్నారు. గత ప్రభుత్వ పాలనకు భిన్నంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పాలన ఉంటుందని కూటమి నేతలు ప్రజలకు వాగ్దానం చేశారని, అధికారం చేపట్టాక ప్రజల సొమ్ము అధికార దుర్వినియోగానికి కూటమి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. కార్పొరేటర్ల అధ్యయన యాత్రలు విహార యాత్రలుగానే మిగిలిపోతున్నాయని, వీటి వల్ల విశాఖ నగరాభివృద్ధికి, ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోతుందని ఆచరణలో రుజువవుతోందన్నారు. యాత్రలకు ఉపయోగిస్తున్న కోట్లాది రూపాయలు తాగునీరు, విద్యుత్, రహదారులు, వైద్యం తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తే ప్రజల కష్టాలు కొంత మేరకైనా తీరుతాయన్నారు. అధ్యయన యాత్రలపై జీవీఎంసీ కమిషనర్, పాలకవర్గం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందని జగ్గునాయుడు డిమాండ్ చేశారు.

నగరాభివృద్ధిపై దృష్టి సారించండి

సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

జగదాంబ: నగరాభివృద్ధిపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. సోమవారం జోన్–4 కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అంకిత భావంతో పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జోన్–4 పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. నిర్ణీత సమయంలో కాంట్రాక్టర్లతో పనులు చేయించి పూర్తి చేయించాలన్నారు. ఇందుకు ఇంజినీరింగ్ అధికారులు బాధత తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో లీక్‌లు లేకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. వీధి దీపాల నిర్వాహణలో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు, సోలార్ విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై ఆరా తీశారు. జోన్ పరిధిలో జరుగుతున్న కట్టడాల గురించి టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనధికార కట్టడాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్లాన్ మంజూరుకు దరఖాస్తు చేసుకుంటే రెండు రోజుల కంటే ఎక్కువ లాగిన్‌లో ఉంచకుండా పైఅధికారులకు పంపిచాలని తెలిపారు. రోడ్ల విస్తరణ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. జోనల్ స్థాయి అధికారులు తప్పకుండా వార్డుల్లో పర్యటించాలన్నారు. పారిశుధ్య పనుల్లో లోపాలు లేకుండా చూడాలని జెడ్సీ మల్లయ్యనాయుడు, ఏఎంహెచ్‌వో కృష్ణంరాజుకు చెప్పారు. బహిరంగంగా వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలన్నారు. వర్షాల నేపథ్యంలో వీధుల్లో నీటి కుంటలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ నిత్యం చేయిస్తుండాలని ఆదేశించారు. సెంటర్ మీడియన్‌లో పచ్చదనం ఉండే విధంగా కొత్త మొక్కలు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీధర్, మరళీకృష్ణ, నర్సింగరావు, వెంకటేశ్వరరావు, శ్రీరామూర్తి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించాలి



సముద్ర పర్యావరణంపై జరిగిన సదస్సుకు హాజరైన అధికారులు, మత్స్యకారులు

ఏయూ క్యాంపస్ : కేంద్ర మత్స్య సాంకేతిక పరిశోధన సంస్థ (సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో భారతీయ మత్స్య పరిశ్రమలో గేర్ మార్కింగ్ – అవకాశాలు, సవాళ్లు అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా ఆలోచించేందుకు గేర్ మార్కింగ్ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. గేర్ మార్కింగ్‌పై జాతీయ మార్గదర్శకాలను రూపొందించడానికి మత్స్యకారులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ – సీఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్ మాట్లాడుతూ గేర్ మార్కింగ్‌పై ప్రపంచ స్థాయిలో జరుగుతున్న విధానాలను వివరించారు. చట్ట విరుద్ధంగా చేపల వేటను తగ్గించడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. గేర్ మార్కింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే రంగుల కోడింగ్ తోపాటు అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్‌ఎఫ్) ట్యాగ్‌ల వినియోగం తదితర అంశాలను వివరించారు. డాక్టర్ బి.మధుసూదనరావు మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర కాలుష్యం, చట్ట విరుద్ధమైన చేపల వేటను నియంత్రించడానికి గేర్ ట్రేసబిలిటీని ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంఘం, డాల్ఫిన్ బోట్ ఆపరేటర్లు, వలల తయారీదారులు, చిన్న తరహా మత్స్యకారులు, మత్స్య సంస్థలు, ఎన్‌జీవోలు, ఫిషింగ్ గేర్ తయారీ సంస్థల ప్రతినిధులు స్వయంగా సెషన్‌లో పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు. దేశంలో గేర్ మార్కింగ్ అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. డాక్టర్ యు.శ్రీధర్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త జి.కమైతదితరులు పాల్గొన్నారు.